క్లుప్తంగా

తల్లి పాల వారోత్సవాలతో మేలు



గుడ్లవల్లేరు: తల్లి పాల వారోత్సవాలతో బిడ్డ తల్లులు, గర్భిణులకు మేలు చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ అన్నారు. శుక్రవారం డోకిపర్రులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆమె తల్లి పాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో తల్లి పాల విశిష్టతను బిడ్డ తల్లులు, గర్భిణులకు వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులతో ప్రజలకు ఇక్కట్లు

గుడ్లవల్లేరు: కౌతవరం చెక్‌పోస్ట్ వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో శుక్రవారం ఆ గ్రామంలోని చిన దళితవాడ, చెక్‌పోస్ట్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చే విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గుల కారణంగా ఏసీలు, మోటార్లు, బల్బులు, వాషింగ్ మిషన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయినట్లు బాధిత వినియోగదారులు వాపోయారు. విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాస్ ఆదేశాలతో ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సిబ్బంది బాగుచేసేందుకు చర్యలు చేపట్టారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు



గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలను శుక్రవారం స్థానిక జీఆర్‌కే మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, జి. కిరణ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

కార్మికుల్లో వ్యక్తిగత విభేదాలు లేవు

గుడివాడ టౌన్: గుడివాడ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కార్మికుల్లో ఎవరికీ వ్యక్తిగత విభేదాలు లేవని డిపో మేనేజర్ డి. రాజేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని యూనియన్ నాయకులపై కొందరు చేస్తున్న విమర్శలకు అవకాశం లేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వం చేపడుతున్న కొత్త విధానాలను అమలు చేసేందుకు ఐకమత్యంతో పనిచేయాలని తాను సూచిస్తున్నానన్నారు. ఏ ఒక్కరూ వ్యక్తిగత విమర్శలకు వెళ్లరని, అంతా ఐకమత్యంగా పనిచేస్తారని ఆయన తెలిపారు. ఇతర విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

పామర్రు పోలీస్‌స్టేషన్ తనిఖీ

పామర్రు(మొవ్వ): పామర్రు పోలీస్‌స్టేషన్‌ను గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో ఉన్న రికార్డులు తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను, యాక్సిడెంట్ అయిన వాహనాల రికార్డులు పరిశీలించారు. రికార్డులు కరెక్టుగా ఉన్న వాహనాలను యజమానులకు తిరిగి ఇవ్వాలని సూచించారు.

ఘనంగా డేటా సైన్స్‌డే



గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాల్లో శుక్రవారం అంతర్జాతీయ డేటా సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యులెర్న్ కంపెనీ హెచ్‌ఆర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో డేటా సైన్స్‌పై అవగాహన కల్పించినపుడే వారు మంచి భవిష్యత్‌కు ఎదగగలుగుతారన్నారు. అనంతరం కోడ్ డబ్బింగ్, లోగో డిజైన్, మినీ ప్రాజెక్ట్స్ వంటి వాటిపై క్విజ్ నిర్వహించారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు, చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణారెడ్డి, అకాడమీ డైరెక్టర్ బీఈఎల్ఎన్ నాయుడు, డేటా సైన్స్ విభాగాధిపతి టి. సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

తోట్లవల్లూరు: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పెనమకూరు తోపాటు పలు గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్ నగదును ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. జనసేన నాయకుడు తాడిశెట్టి నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన పోలీసులు

కైకలూరు: రహదారికి పోలీసులు శుక్రవారం మరమ్మతులు చేయించారు. స్థానిక ఏలూరు రోడ్ మూడు కూడళ్ల వద్ద గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు రహదారి మరమ్మతులు చేయించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

శిథిలావస్థలో సంపద కేంద్రం

నాడు రాష్ట్ర స్థాయి గుర్తింపు.. నేడు స్తంభాలకే పరిమితం



పెదపారుపూడిలో శిథిలావస్థకు చేరిన చెత్త నుంచి సంపద కేంద్రం

పెదపారుపూడి: పెదపారుపూడిలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రం అధికారుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2015 సంవత్సరంలో ఈ సందప కేంద్రం నిర్మించారు. ఈ విధంగా నిర్మించిన వాటిలో పెదపారుపూడి సంపద కేంద్రానికి 2016లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చింది. దీంతో జిల్లా స్థాయి శిక్షణ తరగతులు సుమారు నాలుగు సంవత్సరాలు ఇక్కడ నిర్వహించారు. అలాంటి సందప కేంద్రం సుమారు రెండేళ్ల నుంచి పూర్తిగా నిరుపయోగంగా మారింది. అప్పట్లో తాటాకులతో నిర్మించిన షెడ్లు పూర్తిగా పనికి రాకుండా పోయాయి. మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం వలన మూడు సంవత్సరాల నుంచి శిథిలావస్థకు చేరిందని స్థానికులు చెబుతున్నారు.

వర్మీ కంపోస్టు తయారీ ఎక్కడ?

రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన చెత్త నుంచి సంపద కేంద్రం ఇప్పుడు ఎందుకూ పనికి రాకుండా నిరుపయోగంగా మారింది. మండల స్థాయి అధికారుల సంపద కేంద్రం నుంచి పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామం నుంచి వచ్చిన చెత్తను తగుల పెడుతున్నారే తప్ప వర్మీ కంపోస్టు తయారు చేయటం లేదు.

యంత్రాలు ఎక్కడ?

రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందటంతో ప్రభుత్వం నుంచి సంపద కేంద్రానికి సుమారు రూ.3లక్షల విలువ చేసి సింగిల్ యూజ్ యంత్రం, గాజు ముక్కలు చేసే షట్టర్‌ను ఈ కేంద్రానికి ఇచ్చింది. ఈ సంపద కేంద్రం శిథాలావస్థకు చేరింది. దీంతో ప్రభుత్వం అందజేసిన రూ.లక్షల విలువజేసే యంత్రాలు ఎక్కడ ఉన్నాయో తెలియటం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి చెత్త నుంచి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు సమకూరితే నిర్మిస్తాం

ఈ విషయంపై గ్రామ సర్పంచ్‌ను సమీరాను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు.

ఎంపీడీఓ విమాదేవిని వివరణ కోరగా ఎంజీఎన్‌జీఎస్ ద్వారా షెడ్ నిర్మాణానికి నిధులు ఒక్కసారి మాత్రమే వసాయని, ఎవరైనా దాతలు లేదా ట్రస్టు ద్వారా నిర్మాణ పనులు చేపట్టాలని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కలిదిండి(కైకలూరు): వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి కల్యాణి ఫంక్షన్ హాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డీఎన్నార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రశ్నిస్తే కేసులు పెడుతోందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయలేదన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గాదిరాజు వెంకట కిషోర్ మణికంఠ వర్మ, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు దుగ్గిరాల వెంకటనాగేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. ముందుగా వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. క్యూఆర్ కోడ్ కలిగిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, గ్రామ స్థాయి నాయకులు సాగిరాజు సూర్యనారాయణ రాజు, కుసంపూడి కనకదుర్గా రాణి, బ్రహ్మాజీ, నాగరాజు, జాన్ విక్టర్, వడుపు రామారావు, శ్రీనివాసరావు, డి.ఏసుబాబు, అన్నవరం, గోదావరి సత్యనారాయణ, కొల్లాటి సత్యనారాయణ, చార్లెస్, వెంకటేశ్వరరావు, జి.ఏసుబాబు, రవికుమార్, పండు ఆనంద రవిరాజు, నవీన్ పాల్గొన్నారు.



కలిదిండిలో క్యూఆర్ పోస్టర్లను చూపుతున్న డీఎన్నార్, నాయకులు

ఇసుకలో ఎమ్మెల్యే అవినీతి పెరిగిపోయింది

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

పెదపారుపూడి: పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా ఇసుక, మట్టి తవ్వకాల్లో అవినీతి చేసి కోట్ల రూపాయలు దండుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పెదపారుపూడిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఇసుక క్వారీలో రాత్రిళ్లు దిగ వద్దు అని చెప్పినా ఎమ్మెల్యే వర్ల రాత్రి 10 గంటల దాటిన తరువాత రోజుకు 300 నుంచి 400 లారీలు ఇసుక తవ్వకుని రోజుకు రూ.50 లక్షల అవినీతిని ఏరకంగా పాల్పడుతున్నాడో ప్రజలు గమనించాలన్నారు. పెదపారుపూడి మండలంలోని వెంట్రప్రగడ మరికొన్ని గ్రామాల్లో భారీ ఎత్తున మట్టి తవ్వి, సుమారు రూ.10 కోట్లకు అమ్మకం చేయటం అంటే ఎంత దారుణమో ఆలోచన చేయాలన్నారు. ఎవరైతే అక్రమంగా చెరువులు త్వవకం చేశారో.. తమకు అవకాశం వచ్చిన రోజున న్యాయపరంగా చట్టం ముందు నిలబెడుతామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఎవరైతే ఇబ్బంది పెట్టారో వారిపై వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీపీ గోగం సురేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మూల్పూరి హరీష, జిల్లా అధికార ప్రతినిధి చీకుర్తి వరప్రసాద్, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ ఆల రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మల కోటేశ్వరరావు, కంభం డేవిడ్, పుణుకొల్లు శివరామప్రసాద్, పల్లా అరవింద్, చేబ్రోలు సుజాత, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

కొండలమ్మకు ఘనంగా శ్రావణ పూజలు



శ్రీవిజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలను వేద మంత్రోచ్చరణ నడుమ చేపట్టారు. అనంతరం సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు.

పూజా సామగ్రి బహూకరణ

అమ్మవారి పూజకు ఉపయోగించే నిమిత్తం ఇత్తడి సామగ్రిని మచిలీపట్నం హౌసింగ్ బోర్డు వాస్తవ్యులు మాధవ దంపతులు సమర్పించారు. ఆ దంపతులు పీటలపై కూర్చొని అమ్మవారి పూజలను చేపట్టారు. అనంతరం అమ్మవారికి ఆ దంపతుల పేరిట వేద పండితులు పూజలను నిర్వహించి, లడ్డూ ప్రసాదాలను అందించారు.

6న అమ్మవారి హుండీల లెక్కింపు

ఈ నెల 6వ తేదీన ఉదయం 9గంటలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో శ్రీ అమ్మవారి దేవస్థానంలోని హుండీలను తెరిచి కానుకలను లెక్కించనున్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో కొలువైన ఆలయాల్లో రెండో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఆయా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం తదితర దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొండలమ్మ ఆలయంలో పీటలపై కూర్చొన్న దాతలు మాధవ దంపతులతో పాటు ఈఓ దంపతులు



భద్రిరాజుపాలెం శివాలయంలో కుంకుమ పూజ నిర్వహిస్తున్న భక్తులు



గుడివాడలో ప్రత్యేక అలంకారంలో శ్రీ విజయదుర్గ అమ్మవారు



కూచిపూడిలో లక్ష్మీ దేవిగా బాలమ్మ

గుడివాడలో..

గుడివాడ టౌన్: శ్రావణ శుక్రవారం పూజలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలో సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. శ్రావణమాసం పురస్కరించుకుని స్థానిక శ్రీఅన్నపూర్ణ సహిత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు స్వర్ణ శివమహిధర్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని కూచిపూడి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు నిర్వహించారు.

కైకలూరులో.

కైకలూరు: స్థానిక శ్యామలాంబ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పూల అలంకరణ కూరెళ్ల మురళీకృష్ణ చేయించారు. ఉచిత ప్రసాద దాతలుగా ముదునూరి జానకి రవీంద్ర సుబ్బరాజు, శ్యాంప్రసాద్ రాజు, సూర్యనారాయణ వర్మ, రామకృష్ణంరాజు, శ్యామలరావు, రామసుబ్బారావు, శ్రీనాథ్, గోళ్ల కొండ, హనుమంతరావు, దుర్గ రాజు వ్యవహరించారు. మీసాల వెంకన్న ఆలయంలో టీటీడీ విశ్రాంత సమన్వయాధికారి మండలిక కృష్ణ కుమారశర్మ భగవత సప్తాహనం ప్రారంభించారు.

బ్యాంకర్లు భద్రతా ప్రమాణాలు పాటించాలి

డీఎస్పీ ధీరజ్ వినీల్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: రిజర్వ్ బ్యాంక్ సూచనలకనుగుణంగా బ్యాంకర్లు విధిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బ్యాంకర్లతో శుక్రవారం డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పోలీస్‌శాఖ, బ్యాంకులు సమన్వయంతో పని చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరు, సెక్యూరిటీ గార్డుల నియామకం, సురక్షిత నగదు రవాణా, ఆన్‌లైన్ మోసాల నివారణ, సైబర్ భద్రత తదితర అంశాలపై వివరించారు. నూతనంగా నియమించుకునే తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ముందస్తు పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. రాత్రి సమయాల్లో ఏటీఎంల వద్ద చక్కని వెలుతురు, సెక్యూరిటీ గార్డును ఉంచాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినప్పుడు, అత్యవసర సమయాల్లో పోలీసులకు సమాచారం చేరవేసే విధంగా లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ బ్యాంకర్లకు సూచించారు. సమావేశంలో గుడివాడ తాలూకా, వన్‌టౌన్ సీఐలు ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.

కార్మికులపై పని భారాన్ని తగ్గించాలి

గుడివాడ టౌన్: ఆర్టీసీ కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ కార్మికులపై పనిభారం పెంచుతున్నారన్నారు. ఎనిమిది గంటలు చేయాల్సిన పని 10 నుంచి 12 గంటలు చేయాల్సి వస్తోందన్నారు. ఇది యాజమాన్యానికి, డిపో మేనేజర్‌కు సరికాదన్నారు. వెంటనే యాజమాన్యం తన విధానాలను మార్చుకుని కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ సెక్రటరీ బాలాజీ, డిపో సెక్రటరీ కేఎస్ రావు, ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి బసవయ్య, డిపో సెక్రటరి మూర్తి పాల్గొన్నారు.

ఎరువుల కొరతతో రైతుల ఆందోళన

150టన్నుల యూరియాకు 60 టన్నులే పంపిణీ



గూడౌన్‌లో యూరియా కోసం పోటీ పడుతున్న రైతులు

గుడ్లవల్లేరు: మండలంలోని కట్టవానిచెరువులో రైతులకు నిర్వహించిన ఎరువుల పంపిణీలో ఆందోళన నెలకొంది. శుక్రవారం 20 టన్నుల(445బ్యాగ్‌ల) యూరియా దిగుమతైంది. అందులో విన్నకోటలో 245 బ్యాగ్‌లను దిగుమతి చేశారు. మిగిలిన 200 బ్యాగ్‌లను కట్టవానిచెరువు గూడౌన్‌కు పంపించారు. విన్నకోట పీఏసీఎస్ కింద ఈ కట్టవానిచెరువు గూడౌన్ నుంచి అందించే ఎరువుల పంపిణీ చేస్తున్నారు. కట్టవానిచెరువుతో పాటు చింతలగుంట, తాడిచెర్ల, చినగొన్నూరు, పురిటిపాడు ప్రాంతాల్లోని రైతులకు ఈ ఎరువులను అందించాల్సి ఉంది. విన్నకోటతో సహా ఈ చుట్టుపక్కలున్న గ్రామాలకు 150 టన్నుల యూరియాకు 60 టన్నులే పంపిణీ చేశారు. కనీసం మరొక 60 టన్నులను విన్నకోట పీఏసీఎస్‌కు దిగుమతి చేస్తే...ఇంత యూరియా కొరత ఉండదని అధికారులు చెబుతున్నారు. అరకొరగా ప్రభుత్వం అందిస్తున్న యూరియాతో రైతులు ఇబ్బందుపడుతున్నారని పేర్కొన్నారు. అంతంత మాత్రంగా దిగుమతయ్యే యూరియా సరిగా అందక పోవటంతో మహిళా రైతులు సైతం పడిగాపులు పడుతున్నారు.

పశువులను రోడ్లపై వదలొద్దు

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలో పశువులను యజమానులు రోడ్లపై వదల వద్దని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పశుపోషకులతో ఆయన సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పశువులను విచ్చలవిడిగా రోడ్లపై వదిలేయడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కు పూర్తి అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఇకనుంచి రోడ్డుపై పశువులు కన్పిస్తే కచ్చితంగా బందెల దొడ్డిలో పెడతామన్నారు. అక్కడ సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కసారి బందెల దొడ్డిలో పశువును బందిస్తే జరిమానా రూ. 10 వేలు కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామంగా మార్చేందుకు కృషి



పంచాయతీ సిబ్బంది సత్కరించిన సర్పంచ్

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడిని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సర్పంచ్ తాతా రజిని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం నూరు శాతం అమలు పరిచే కార్యక్రమంలో భాగంగా తాజాగా 'చెత్త ఇచ్చుకో–గిఫ్ట్ పుచ్చుకో' అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. శనివారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.ప్రభుకుమార్, మండల కో-ఆప్షన్ సభ్యులు అప్పికట్ల ఇమ్మానియేలు, కూచిపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన

పామర్రు(మొవ్వ): పామర్రు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తోట్లవల్లూరు, పెదపారుపూడి, పామర్రు, మొవ్వ మండలాల్లోని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ నెల 10 వతేదీ నుంచి నిర్వహించే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా హాజరు తీసుకునే విధానాన్ని, ఉపాధి హామీ పథకంలో చేయు పనులకు జియో ఫెన్సింగ్‌పై ఫీల్డ్ అసిస్టెంట్లకు టీఓటీ హర్ష, ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి రెడ్డి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కే జ్యోతి, జేక్యూసీ క్లస్టర్ అసిస్టెంట్ ప్రసాద్, కోర్సు డైరెక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తోట్లవల్లూరు రేవులో పడవ యజమానులకు సూచనలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

తోట్లవల్లూరు: కృష్ణానది వరదతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ సూచించారు. తోట్లవల్లూరు, పాములలంక వద్ద కృష్ణానది వరద తీవ్రతను తహసీల్దార్ ఎం. కుసుమ కుమారితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వరద తీవ్రతతో లంక గ్రామాల ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని ధీరజ్ వినీల్ తెలియజేశారు. పడవల్లో 20 మందికి మించి ఎక్కించొద్దని పడవ యజమానులను ఆదేశించారు. పడవ యజమానులు నిబంధనలు పాటించాలని, రైతులు, కూలీలు కూడా జాగ్రత్తగా రాకపోకలు సాగించాలన్నారు. పాములలంక గ్రామస్తులతో ముచ్చటించటంతోపాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. లంక గ్రామాల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్ఐ అవినాష్ పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత

మండవల్లి: పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను పరిశీలించి శుక్రవారం అందజేశారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, సురేష్‌బాబు, శివయ్య, చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులోని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాజిలిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో ఎముకలు, కీళ్లు, నడుము, దంత, గుండె, హోమియో, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి వైద్యం అందించనున్నారని డాక్టర్ వెంకట్రావు శుక్రవారం తెలిపారు.

జాతీయ రహదారిపైకి మురుగు నీరు వదిలివేత



పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపైకి మెస్ నుంచి వస్తున్న వాడకపు నీరు

కైకలూరు: కైకలూరు పాత కుమారీ థియేటర్ ఎదురుగా జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన దుకాణ కాంప్లెక్స్‌లో రామయ్య మెస్ నుంచి వాడకం నీరు జాతీయ రహదారికి వదిలేస్తున్నారు. పంచాయతీ డ్రెయిన్ సౌకర్యం ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా హోటల్లో వాడకపు నీరు రోడ్డుపైకి చేరుతుంది. ఇటీవల ఈ దుకాణం ఎదురుగా రోడ్డుపై పదో తరగతి విద్యార్థిని సైకిల్‌పై వెళుతూ మార్జిన్ లేక లారీ కింద పడి మరణించింది. హోటల్ నుంచి వచ్చే వర్షపు నీటితో గుంతలు పడటంతో అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. రామయ్య మెస్ నుంచి నీరు రావడంపై కైకలూరు పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగం వెళ్లి హెచ్చరించారు. పంచాయతీ డ్రెయిన్ ఉండగా నీటిని రోడ్డుపై వదిలితే చర్యలు తీసుకుంటామన్నారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఈ విషయమై పంచాయతీ ఈఓ. వై.ప్రసాద్ వివరణ ఇస్తూ స్వయంగా వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వాలి

గుడివాడ టౌన్: ప్రతి తల్లీ తన బిడ్డకు కనీసం ఆరు నెలలు పాలు ఇవ్వడం ఎంతో మంచిదని సీడీపీఓ విజయాఫ్లారెన్స్ అన్నారు. శుక్రవారం స్థానిక 25వ వార్డు పెద ఎరికపాడు మున్సిపల్ ప్రైమరీ పాఠశాల అంగన్‌వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయంతి, పాఠశాల హెచ్‌ఎం ఆళ్వారమ్మ, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : గుడివాడ
IA No. 257/2024 in
OS No. 175 / 2018

[illegible]

1) [illegible]
2) [illegible] ... రెస్పాండెంట్లు

1) [illegible] వయస్సు 68 సం॥లు, డోర్ నెం. 2-2-2, యలమర్రు గ్రామం, పెదపారుపూడి మండలం, కృష్ణాజిల్లా.
2) [illegible] W/o [illegible] వయస్సు 50 సం॥లు, డోర్ నెం. 2-2-2, యలమర్రు గ్రామం, పెదపారుపూడి మండలం, కృష్ణాజిల్లా.

పైన తెలిపిన [illegible] తేది. 18 8 2025వ తేదీకి [illegible] ఉదయం 10.30 గంటలకు పై తెల్పిన కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై [illegible]
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గుడివాడ
1-8-2025 కె. యశోదయాదుల దేవి
[illegible]
గుడివాడ, కృష్ణాజిల్లా. సెల్ : 81791 38910